# వారసుడు

"అదేవిటోయ్ ... ఇంకా ఆపీసు కుర్చీలోనే ఉన్నావ్ ! ఇంటికి వెళ్ళవా?" అని అడిగాడు కొలీగ్ పరమేశం.

"వెళ్తాను" అన్నాను.

పరమేశం వెళ్ళిపోయాడు.

గడియారం వంక చూసుకున్నాను. అయిదూ ముప్పై దాటింది. రోజూ ఈ సమయానికి బస్సులోను, మరో పావుగంటలో ఇంటిలోనూ ఉండేవాణ్ణి.

ఈ రోజు కుర్చీలోంచి లేవలేకపోతున్నాను అడుగు వేయాలంటే గుండె కలుక్కుమంటోంది. మనసు నిండా దిగులుతో మరో అరగంట అలాగే కూర్చుండిపోయాను.

ప్యూను గది తాళం చెవి ఇచ్చి వెళ్ళాడు. చౌకీదార్ ఒకసారి చక్కర్ కొట్టి వెళ్ళాడు.

"ఆప్ అభీతక్ బైటే సాబ్?" అన్నాడు.

తలూపాను.

గది ప్రశాంతంగా ఉంది.

ఫైళ్ళు అల్మారాల్లోను, టేబుళ్ళ మీద కునుకు తీస్తున్నాయి. టైపు మిషను టకటక శబ్దాల్ని దాచేసింది. నా మదిలో మాత్రం అలజడి. ఉవ్వెత్తున ఎగిసిపడే సముద్ర తరంగాల్లా ఎడతెగని ఆలోచనలు ...

టేబుల్‌మీద తల పెట్టి పడుకుంటే చెవుల్లో గుండె సవ్వడి వినిపిస్తున్నది.

ఇంటికి వెళ్ళి.... నా భార్య జానకికి ఈ వార్త ఎట్లా చెప్పను ?

చెప్పలేని ... చెప్పకుండా ఉండలేని పరిస్థితి.

సమయం ఆరున్నర.

ఈపాటికి ఇల్లు చేరి జానకి శాంత వదనాన్ని చూస్తూ కాఫీ తాగే సమయం.

నా మోకాలి మీద చెక్కిలి ఆన్చి కూర్చుని ఆమె నేను చెప్పే కబుర్లు వినే సమయం.

కాని ఈ రోజు నేను చెప్పబోయేది కబురు కాదు - గుండెను కోసే కత్తిలాంటి వార్త,

ఆఫీసుకు టైమ్ అయి విసుక్కుంటున్న బతిమిలాడి ఆప్యాయంగా గోరుముద్దలు తినిపించే నా భార్యకు మనసును గాయం చేసే ఈ వార్తను ఎలా చెప్పను?

సమయం ఏడు.

ఇంకా నేను రాలేదని ఎంత దిగులు పడుతున్నదో జానకి. పిల్లల హోంవర్కును, పిల్లలను పట్టించుకోకుండా ద్వారంలో దిగులుగా నుంచుని నా కోసం ఎదురుచూస్తుంటుంది.

జానకి దిగులు రూపం నా కళ్ళలో కదులుతోంది కుర్చీలో ఇంక కూర్చోలేకపోయాను. ఈ రోజు కాకపోయినా రేపైనా ఆమెకు ఈ వార్త తెలిసేదే రేపు ... రేపు.... ఓ మై గాడ్... లేచిన వాణ్ణి అలాగే కుర్చీలో కూలబడిపోయాను.

రేపు... జానకి పుట్టిన రోజు

సందడి పడుతున్న ఆమె మనసును ఈ విషాద వార్తతో ఎలా కలచివేయను?

తన పుట్టిన రోజు పండుగనాడు... నా కిష్టమైన దుస్తులు వేసుకోడానికి... నా కిష్టమైన పిండివంటలు చేసి తినిపించడానికి సంబరంగా ఎదురు చూస్తున్నదే... ఆమెకు ఈ విషాద వార్త ఎట్లా చెప్పను?

ఆమె గుండె ఎంత క్షోభిస్తుందో నాకు తెలుసు.

అయినా తప్పదు. చెప్పక తప్పదు.

పోనీ ఈ ఒక్క రోజూ ఆగితే...

మరునాటి ఆమె విషాద వదనాన్ని గుర్తు చేసుకుంటూ పుట్టిన రోజు ఆమె పడే సంతోషాన్ని ఎలా భరించేది?

తెలియగానే ఆమెకు ఈ విషయం చెప్పకపోవడం మోసం కాదా?

చెప్పకపోతే... ఇన్ని రోజుల్నుంచి మాకి విషయం తెలియనివ్వని 'ఆ' దుష్టునికి, నాకు ఏం భేదం?

తప్పదు. ఇంటికి వెళ్ళి... జానకితో ఈ విషయం చెప్పేయాలి. ఆమె బోరున విలపిస్తుంది. గుండెలవిసిపోయేలా వెక్కి వెక్కి ఏడుస్తుంది. అలా మనసారా ఏడ్వనివ్వాలి. గుండెలోని బాధంతా కరిగి వచ్చేలా ఏడ్వనివ్వాలి. మరునాడు పుట్టిన రోజు పండుగలా గడవకున్నా ఫరవాలేదు. ఆమెను అక్కున చేర్చుకొని ఓదార్చాలి.

ఆ నిశ్చయానికి వచ్చి లేచి నిల్చున్నాను.

కాని... జానకి విషాద వదనం గుర్తుకొచ్చి అడుగులు తడబడు తున్నాయి...గుండెలో సముద్రం కూర్చున్నంత బరువు. నేనే ఇంత బాధపడు తుంటే జానకి ఈ వార్తకు ఎలా తట్టుకుంటుంది?

ఎలా గదినుంచి బయటపడ్డానో తెలియదు. చౌకీదార్‌కు ఏం చెప్పానో తెలియదు. బస్ స్టాప్‌లో బస్సు ఆగినా ఎక్కలేదు. రోడ్డువెంట అలా నడుస్తూ పోయాను. ఎదురుగా అలలతో అల్లకల్లోలంగా ఉన్న హుసేన్‌సాగర్. ఓ ఇనుప బెంచీ మీద కూర్చున్నాను.

ఆ దుర్మార్గుడే దీని కంతటికీ కారణం. పైగా మేమే తప్పు చేశాం అంటాడు. మేం చేసింది తప్పెలా అవుతుంది? ప్రేమించడం తప్పా? కులం గోత్రం అన్నీ చూసి ప్రేమించాలట! - అంగట్లో వస్తువుల్ని అందాలతో ఉద్యోగాల్ని కొనుకున్నట్లే వాళ్ళకు ప్రేమంటె! - అక్కడికి ఎన్నో విధా లుగా వాడికి నచ్చజెప్పాను.

"మమ్మల్ని వేరు చేయలేరు. బలవంతంగా జానకికి వివాహం చేయా లని చూస్తే ఆమె ఆత్మహత్య చేసుకుంటుంది" అన్నాను.

"దావనీ - చస్తే మాకేం భయంలేదు- నాకు చెల్లెలే పుట్టలేదు అనుకుం టాను" అన్నాడు ఆ దుర్మార్గుడు - మా జానకి అన్న.

వాడు, నేను వరంగల్ ఆర్ట్స్ కాలేజీలో బి.ఏ. ఫైనల్ దాకా కలిసి చదువుకున్నాం.

జానకి గౌనులు వేసుకునే వయసప్పటి నుంచి నాకు పరిచయం. తన మంచితనంతో, ఆకర్షణీయమైన వ్యక్తిత్వంతో నా మనసును అల్లుకుపోయింది. ఒకరంటే ఒకరికి అంతులేని ఇష్టం ఏర్పడింది. అభిమానం పెరిగింది. పొద్దున లేచింది మొదలు ఒకరి నొకరం పలకరించుకోకుండా మంచినీళ్ళు కూడా ముట్టేవాళ్ళం కాదు.

మా ఇళ్ళు ఒకే వీథిలో ఉండేవి. పేరుకు వేరు వేరు ఇళ్ళయినా జానకి ఎప్పుడూ మా ఇంట్లోనే ఉండేది.

"సినిమాల్లోను, నవలల్లోను ఉన్నట్లు నిజ జీవితంలో ప్రేమ అనేది ఉండదు."

జానకి, నేను ప్రేమించుకున్నా, పెళ్ళి చేసుకుంటాం అని చెబితే వాడి చ్చిన జవాబు అది.

ఆ మూర్ఖునితో ఇంకేం వాదించను ?

పైగా ''స్నేహితుడివి... నా తోడబుట్టిన లాంటి వాడివని నమ్మాను. ఇంత మోసం చేస్తావా?" అన్నాడు.

''ఏది మోసం? ఏమీ తెలియనట్లు నటించి నీ చెల్లెలికి ద్రోహం చేస్తే మోస మవుతుంది. కాని మేమిద్దరం ప్రేమించుకున్నాం, పెళ్ళి చేసుకుంటాం అంటే మోసమెలా అవుతుంది?"

''అదంతా నాకు తెలియదు. ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదు. మీదేం కులం, మాదేం కులం?' అన్నాడు కోపంగా.

"స్నేహానికి అడ్డురాని కులాలు ప్రేమకు, పెళ్ళికి అడ్డొచ్చాయా?"

"అది వేరు, ఇదివేరు."

"ఏది వేరు కాదు. ఇంత చదువుకున్నా మనలో ఇంకా సంకుచిత్వం పోలేదు. మనసులు ఎదగలేదు. కులం కులం అంటావే నీదేం కులమని నీ ఉద్దేశం."

చెప్పాడు.

"మరి నీ కులవృత్తి చేస్తూ లేవేం... ఈ ఐరన్ షాప్ పెట్టావ్?" అని అడిగాను.

మాట్లాడలేదు.

"కుల వృత్తులతో కులాలు వచ్చాయి. ఇప్పుడు కుల వృత్తులు లేవు. ఎవరికి తోచిన వ్యాపకంలో వాళ్ళు స్థిరపడుతున్నారు. ఇంకా కులా లనేవి ఎక్కడున్నాయి చెప్పు?"

"నువ్వెన్ని డైలాగులు చెప్పినా ప్రయోజనం లేదు. రేపు మా బంధువుల్లో ఎలా తలెత్తుకొని తిరగ్గలం? మా అమ్మ నాన్న ఇందుకు అంగీకరించరు."

"మీ అమ్మ నాన్న అంగీకరించరు అంటే దానికొక అర్థం ఉన్నది. ఆ తరం వేరు. వారు పుట్టిపెరిగిన సామాజిక పరిస్థితులు వేరు. కాని నేడు పరిస్థితులు మారాయి. కులభేదాలు విస్మరించి మనమంతా భుజం భుజం కలిపి దేశాభ్యుదయానికి పాటుపడాల్సిన సమయం ఇది. ఈ సామాజిక అవసరాన్ని గుర్తించక నీలాంటి యువకుడు కులాల్ని ప్రశ్నించడం మూర్ఖత్వమే అవుతుంది."

"నేను మూర్ఖుణ్ని. రాక్షసుణ్ని. కసాయివాణ్ని. ఎన్నయినా అనుసరేనా... కాని ఇంకోసారి నా చెల్లెలి ప్రసక్తి తెచ్చావో మర్యాద దక్కదు, దానితో నీ పెళ్ళి ఇంపాజిబుల్. ఈ విషయాన్ని ఇంతటితో మరచిపోతే నీకూ మంచిది, నాకూ మంచిది లేకపోతే పులి నోట్లో తలపెడుతున్నావ్ జాగ్రత్త" అని హెచ్చరించాడు.

నేను వాడితో ఇక వాదించలేదు. ప్రేమను నమ్మనివాడికి ప్రేమశక్తి తెలియని అజ్ఞానికి ఎన్ని చెప్పి ప్రయోజనమేమి?

"నువ్వు అన్నవైనంత మాత్రాన జానకి బతుకును శాసించే అధికారం నీకు లేదు. ఆమె మేజర్" అన్నాను చివరగా.

"మేజర్... గీజర్ అవన్నీ జాన్తానై" అంటూ టేబుల్ సొరుగులోంచి బ్రాందీబాటిలు తీసి గడగడా సగం ఖాళీచేశాడు. అదంతా నన్ను భయపెట్టడానికే.

"ఇంకొకడెవడన్నా ఇలా ప్రేమ గిమా అని కూశాడంటే వాడిని గారంటీగా ముక్కలుముక్కలుగా నరికేవాడ్ని. కాని నువ్వు నా చిన్ననాటి స్నేహితుడివి. కనుక వొదిలేస్తున్నాను" అన్నాడు.

ఇన్నాళ్లు వాడితో స్నేహం ఎలా చేశానా అని ఆశ్చర్యపోయాను వాడిలోని ఈ రూపాన్ని నేను గుర్తించినా-మా ప్రేమ. మా నిజాయితీ వాడిని మారుస్తుంది అనుకున్నాను. కులభేదాలు చెప్పకుండా తల్లి, తండ్రిని ఒప్పించి మా ఆదర్శ వివాహానికి సహకరిస్తా దనుకున్నాను.

కాని వాడే ఇలా ప్రవర్తించడంతో జానకి. నేను ఒంటరిగా నిశ్చయించుకున్నాము.

నా తరపు వాళ్ళ నుంచి ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోడానికి నేను సిద్ధంగా ఉన్నాను. మా నాన్నగారు ఎక్కువగా చదువుకోకపోయినా సమాజాన్ని చదివి పరిస్థితులను అర్థం చేసుకున్న సంస్కారి. ఆయన మా వివాహానికి అడ్డు చెప్పలేదు. తన కూతురును నేను చేసుకోడం లేదని తెలిసి మా మేనమామ తనకు బాకీ పడిన డబ్బు వెంటనే కట్టమని ఒత్తిడి చేశాడు. మానాన్న మాకు ఆధారమైన ఒక్క ఇల్లు అమ్మి ఆ బాకీ తీర్చేశాడు. అలా కట్టు బట్టల్తో మేం హైదరాబాద్ వచ్చేశాం. ఆ తర్వాత జానకి కూడా హైదరాబాద్ వచ్చేసింది. మే మిద్దరం రిజిష్టర్ మారేజ్ చేసుకున్నాం.

కొన్నాళ్లు జానకిని రహస్యంగా ఉంచాల్సి వచ్చింది. అప్పుడప్పుడే నేను ఉద్యోగంలో స్థిరపడుతున్నాను. జానకి అన్న ఎంతకైనా తెగిస్తాడని నాకు తెలుసు.

అందుకే మా పెళ్ళికి ముందు కొంత నాటకం నడిచింది.

"జానకి కనబడటంలేదు...." అని వాడు హైదరాబాద్‌కు వచ్చాడు.

"నాకేం తెలుసు?" అన్నాను. "నువ్వు మరిచిపోతే చాలు మా చెల్లెలు సంగతి నేను చూసుకుంటా. దానికి నెల రోజుల్లోపలే పెళ్ళి చేస్తానో లేదో చూడు అన్నావు కదా... నువ్వు పెట్టే హింసలు భరించలేక ఏ నుయ్యో గొయ్యో చూసుకొని ఉంటుంది. నూతులు, గోతులు చూడక ఇక్కడికెందుకు వచ్చావ్?" అని అడిగాను.

నన్ను చంపుతానని బొడ్లోనుంచి కత్తితీశాడు.

"ఎక్కడ దాచావో నిజం చెప్పు. లేకపోతే నిన్ను పొడిచి నేను పొడ్చుకొని చస్తా" అని బెదిరించాడు.

చెబితే లాక్కుపోయి వివాహం చేయిస్తాడట. తమ కులం వాడెవడో చేసుకోడానికి సిద్ధంగా ఉన్నాడట.

"అది వ్యభిచారం కాదా! మనసొకచోట. మనువొకచోటనా? వాడికి నీ చెల్లెలి ప్రేమవ్యవహారం తెలిస్తే ఇంటిలోనుంచి తరిమివేయడా!" అంటే డబ్బుతో వాడి నోరు మూయిస్తా అన్నాడు.

అలాంటి ప్రబుద్ధుడు కొంతకాలం తరువాత ఓ టీచర్‌ను పెళ్ళిచేసుకొని ఆమె ఒకప్పుడు ఎవరినో ప్రేమించిందని తెలుసుకొని నానా హింసలు పెట్టి ఆమె బోరున విలపిస్తున్నా వినకుండా విడాకులిచ్చి మరో పెళ్ళి చేసుకున్నాడు. తనకోనీతి. ఇతరులకోనీతి కాబోలు.

మొత్తంమీద వాడి బెదిరింపులు, మాయోపాయాలేవీ నా దగ్గర పనిచేయలేదు. నీ చెల్లెలి విషయం నాకు తెలియదంటే తెలియదనేశాను.

జానకి నా దగ్గరకు వచ్చింది అనడానికి, మా వివాహం జరిగింది అనడానికి వాడిదగ్గర రుజువుల్లేవు.

వాడి ప్రయత్నాలు ఫలించలేదు.

స్నేహితులద్వారా కూపీలు లాగాలని చూశాడు. బంధువుల ద్వారా భయపెట్టించాడు. పోలీసు కేసు వేస్తే గెలవలేనని వాడికి తెలుసు. అందుకే జానకి ఆచూకీ తెలుసుకొని లాక్కుపోవడానికి ఎన్నో జిత్తులు వేశాడు.

ఒకరోజు నేను పనిచేసే ఆఫీసుకు వారి బంధువొకాయన వచ్చి-

"అరరె గిట్లని నాకు తెల్వది- అమ్మాయి క్షేమంగా ఉందికదా... మీ పెళ్ళి నేను చేయిస్తానయ్యా" అని సంఘ సంస్కర్తలా మాట్లాడాడు. అప్పుడు ఆబిడ్స్‌లో సాగర్ టాకీస్ ఉండేది దాని నానుకునే ఒక హోటల్ ఉండేది ఆ హోటల్లో భోజనం చేయించి, ఆ టాకీస్‌లో సినిమా చూపించి జానకి విషయం నాకేం తెలియదని చెప్పి పంపించాను.

మరోరోజు నేను ఆఫీస్‌నుంచి బయటకు వస్తున్నాను. నల్లరంగుపాంటు మీద తెల్లచొక్కా టక్‌చేసిన ఓ ముసలాయన నాకెదురుగా వచ్చాడు ఆయనే జానకి తండ్రి.

''బాబూ-" అని నా రెండుచేతులూ పట్టుకున్నాడు. దానికి ఒంటో బాగాలేదు. ఇప్పుడో అప్పుడో అన్నట్లుంది" అని చూపించాడు తలమీద కొంగు వేసుకొని దీనంగా చూస్తూ చెట్టుకింద కూర్చున్న జానకి తల్లి కనిపించింది.

మా బిడ్డను మాకు ఒక్కసారి కళ్ళకు చూపించవా బాబూ" అని ప్రాధేయపడుతూ అడిగాడు.

నేనేం ఆలోచించలేదు కూడా. జానకి అన్న ప్లాన్‌లో బాగమేమోనన్న అనుమానం వచ్చినా లెక్కచేయలేదు ఆయన గొంతులోని అర్థింపు నన్ను కలచివేసింది. మరో ఆలోచన లేకుండా వెంటనే ఆటోలో వాళ్ళిద్దరిని జానకి దగ్గరకు తీసుకుపోయాను.

కూతురును చూసి సజల నయనాలతో ఆ వృద్ధదంపతులిద్దరూ ఆర్తిగా అక్కున చేర్చుకున్నారు.

మా విషయం మొదట్నుంచి తెలుసునని, వాడికి భయపడే పైకి ఏమీ అనలేకపోయామని అన్నారు, కలిసిన మీ మనసుల్ని విడదీసే పాపాత్ములం కాదన్నారు. మా కళ్ళతో మీ వివాహం చూస్తాం అన్నారు. వారి అభీష్టం మేరకు ఆ మరునాడే జానకితో నా వివాహం గుళ్ళో జరిగింది. అదేరోజు మా పెళ్ళిని రిజిష్టర్ చేయించాం, జానకి తల్లి తండ్రి సాక్షి సంతకాలు చేశారు. పెళ్ళికి ఎటువైపు బంధువుల్ని పిలిచే సమయం లేదు. అదిగాక వాడికి తెలియకుండా జరుగుతున్న పెళ్ళి కనుక రిజిష్టర్ చేయించాలని జానకితండ్రి సూచిం

చారు. వాడికి తెలియకుండా వచ్చామని చెప్పారు. వాళ్ళ పెద్దకూతురు, అల్లుడు సికిందరాబాద్‌లో ఉంటారు. వాళ్ల ఇంటికి వచ్చే నెపంతో వచ్చామని చెప్పారు,

ఎక్కువరోజులుంటే వాడికి అనుమానం వస్తుందని మా వివాహం జరిగిన మరునాడే వెళ్ళిపోయారు.

అదే ఆఖరుసారి జానకి తల్లిని చూడటం ఆ తరువాత కొంతకాలానికే జానకి తల్లి కన్నుమూసింది వారంరోజుల తరువాత గాని ఆ విషయము మాకు తెలియలేదు. తెలుపకుండా ఆ మూర్ఖుడే అడ్డుపడ్డాడట. ఆ విషయం తెలిసిన జానకి గుండెలవిసేలా విలపించింది అది గతం.

ఇప్పుడు మా వివాహమై పద్నాలుగేళ్ళయింది. ఈ పద్నాలుగు ఏళ్ళలో ఒక్కసారయినా జానకి పుట్టింటో అడుగు పెట్టలేదు.

జానకి తండ్రి మాత్రం అప్పుడప్పుడు మా ఇంటికి వచ్చి పోతుండేవారు. అది కూడా పెద్ద కూతురు ఇంటికి వచ్చే నెపంతో హైదరాబాద్‌కు వచ్చి మా ఇంటికి వస్తుండేవారు. జానకి పుట్టిన రోజు మాత్రం తప్పక వచ్చేవారు. ఆమెకు ఇష్టమైన కలాకంద స్వీటు తెచ్చేవారు. ఇంతకాలం జానకి పుట్టింటితో మిగిలిన ఒకే ఒక బంధంగా ఆయన నిలిచారు.

పుట్టింటికి పోలేకపోయినా అప్పుడప్పుడు వచ్చే తండ్రిని చూసుకొని జానకి మనసు ఊరట పడేది.

నల్లరంగు పాంటుమీద తెల్ల చొక్కా టక్‌చేసి, భుజానికి బాగ్ వేసుకొని ...అందులో జానక్కి ఇష్టమైన కలాకంద స్వీటును ఆమె పుట్టినరోజు తప్పక తెచ్చేవారు ఆయన.

ఆ దృశ్యం నా మనసులో హత్తుకు పోయింది. జానకి పుట్టినరోజు అనగానే ఆ దృశ్యం కళ్ళలో మెదులుతుంది. నడిచే ఓపిక లేకపోయినా.... సికింద్రాబాద్ స్టేషన్లో కాకతీయ రైలు దిగి రిక్షా వేసుకొని మా ఇంటిదాకా వచ్చేవారు.

నల్లపాంటు మీద తెల్ల చొక్కా టక్ చేసి...భుజానికి బాగ్‌తో... అందులో జానక్కి ఇష్టమైన కలాకంద స్వీటుతో ఆయన మా ఇంటికి వచ్చే దృశ్యం ఇక కనిపించదు.

జానకికి తన పుట్టింటితో ఉన్న ఆ ఒక్క బంధం తెగిపోయింది.

జానకి తండ్రి గతించి పదిహేను రోజులయిందట. ఆ విషయాన్ని వరంగల్ నుంచి వచ్చిన ఒక మిత్రుడు చెప్పాడు. ఇరుగు పొరుగు వాళ్లు బంధుమిత్రులు...జానకిని పిలిపించండి...కడసారిగా తండ్రిని కళ్ళ చూసుకుంటుంది అని ఎంత చెప్పినా జానకి అన్న వినిపించుకోలేదట.

"దాన్ని కనుక పిలిపిస్తే పొడుచుకొని చస్తా" అని బెదిరించాడట.

ఆ ఆకారాలు లేవేమో కాని రాక్షసులు ఈ కాలంలోనూ ఉన్నారు.

జానకి తల్లిని చూసుకోలేకపోయింది. తండ్రి కడసారి చూపులకుకూడా నోచుకోలేకపోయింది.

ఆ మనోవేదన ... ఆ క్షోభ భరించలేనిది ... ఆమెను ఎలా ఓదార్చాను? ఈ వార్త ఆమెకు ఎలా చెప్పను?

హుసేన్‌సాగర్ అలల మీద గాఢంగా పరచుకున్నది చీకటి. రోడ్డు మీది వాహనాల అలజడి తగ్గింది. గడియారం వంక చూసుకునే ఓపికలేదు. ఎంత టైమయితే ఏమిటి.. అది ఏ సమయమైతే ఏమిటి.. కదలబోతున్న బస్సు ఎక్కాను.

అడుగులో అడుగు... అడుగులో అడుగు... పర్వతాన్ని మోస్తున్నంత బరువైన అడుగు.. అంత దూరంనుంచే జానకి కనిపించింది. అప్పుడే గడప లోకి వచ్చి నాకోసం చూస్తున్నది. నా కళ్ళు చెమ్మగిల్లాయి. ఈ పరమసాధ్వి తోడ ఆ పరమ కిరాతకుడు పుట్టాల!

"ఇంత ఆలస్య మయిందేం?"

"... ... ..."

"నన్నెంత హైరానా పెట్టావో .." ఆర్తిగా హత్తుకుంటున్న ఆ గుండెకు ... కొన్ని క్షణాల్లో షాక్ లాంటి వార్త.

"జానకీ...."

"ఊఁ...."

''జానకీ ...''

"ఊఁ ... అదోలా ఉన్నావేం. ఒంట్లో బాగాలేదా? ''ఆ లాలనకు నా గుండె లవిసిపోయాయి.

''జానకీ! అన్నం తిన్నావా?" అని అడిగాను.

"నువ్వురాకుండానే ..."

''పద.... ఆకలి బాగా వేస్తోంది... "

షర్ట్ గుండీలు విప్పి - తనే నా దుస్తులు మార్చి మొహం కడిగి తుడిచింది.

ఆ ప్రేమమూర్తి.... మరి కొన్ని క్షణాల్లో శోకమూర్తి అవుతుంది తల్లిని, తండ్రిని... ఇద్దరిని పోగొట్టుకొని... ఇద్దరినీ చివరి క్షణాల్లో చూడలేక పోయినందుకు గుండె తరుక్కుపోయేలా ఏడుస్తుంది.

''ఏమి టా లోచన...అన్నం తినవోయ్...'' అంది.

''ముందు నువ్వు తిను... ఇంట్లో కూడా ఆఫీసు ఆలోచనలేనా... ఏదీ నేను తినిపిస్తా నుండు..." అని గబగబా ముద్దలు చేసి నాకు తినిపిస్తూ తాను తిన్నది.

నే నెంత కఠినాత్ముణ్ణి... ఆ వార్త ఇంకా దాస్తున్నాను, ఆమెతో సేవలు చేయించుకుటున్నాను.

కాని... ఆ వార్త చెప్పలేక పోతున్నాను...అగ్నిపర్వతాన్ని నాలో నే మోస్తున్నాను.

"జానకీ..."

"ఊఁ..."

''మీ నాన్న చనిపోయాడట జానకీ"

''... ...''

"పదిహేను రోజు లయిందట..."

జానకి మాట్లాడలేదు.

ఎటో శూన్యంలోకి చూస్తోంది.

"జానకీ..."

భుజం తట్టాను.

నా గుండెమీద వాలిపోయి బోరున విలపించింది.

"నాన్నా... నాన్నా..." అని తండ్రిని తలచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

ఎన్ని బాధలు మోసింది... ఎన్ని హింసలు భరించింది... ప్రేమ కోసం ఎన్ని త్యాగాలు చేసింది?

అందుకోసం ఆమె ఎన్నడూ విచారించలేదు. బంధువులు దూరమయ్యారని... పండుగలకు, పబ్బాలకు పుట్టింటి రాకపోకలకు దూరమయ్యానని ఆమె వ్యథ చెందలేదు.

కాని... కాని...

"నా కన్న తండ్రిని, తల్లిని... కడసారి చూసుకునే హక్కు నాకు లేదా? వాడు భయపెట్టినంత మాత్రాన భయపడటానికి చుట్టూ ఉన్న వాళ్ళంతా మనుషులేనా? వాళ్ళకు తల్లితండ్రులు లేరా? వాళ్ళకు బిడ్డలు లేరా... నన్ను ఇంట్లోకి రానివ్వకపోతే రానివ్వకపోయారు... కనీసం వీథిలో నుంచొని నా తండ్రి శవాన్నైనా చూసుకోకుండా చేశారు..."

అని విలపించే జానకిని ఓదార్చడానికి నాకు నోరు రాలేదు... భాష అందలేదు.

మరునాడు ఉదయం

కళ్ళు తెరిచేసరికి పక్కన జానకి కనిపించలేదు. కంగారుగా "జానకీ, జానకీ..." అంటూ పరిగెత్తాను వంటగదిలో లేదు. బాత్రూంలో లేదు. ముందు గదిలో లేదు.

జానకి.... నా కాళ్లు వణుకుతున్నాయి. నా గుండె వేగంగా కొట్టుకొం టోంది. పిల్లల్ని పిలిచాను.

"జానకీ"

దేవుని పూజకు పూలుతెస్తున్న జానకి ఎదురైంది. తలంటి స్నానం చేసింది. నా కిష్టమైన లేతగులాబీరంగు చీర కట్టుకుంది.

''జానకీ...." నీళ్లనిండిన కళ్ళతో దగ్గరగా వెళ్లాను.

తొందరగా స్నానంచేసిరా ప్రార్థన చేద్దాం" అంది.

"అలాగే జానకీ...." అని బాత్‌రూంవైపు నడిచాను. ఆ తరువాత పూజ చేసి నా కిష్టమైన మైసూర్‌పాక్ అందించింది.

ఆరోజు ఆమె పుట్టినరోజు

నల్లపాంటు మీద తెల్లచొక్కా టక్‌చేసి.. భుజానికి బ్యాగు - అందులో జానకికి ఇష్టమైన కలాకంద స్వీటు తెచ్చే తండ్రి... ఆ దృశ్యం కళ్ళలో మెదిలింది.

జానకి కళ్ళలోనూ అ దృశ్యమే మెదిలి ఉంటుంది. ఇద్దరి కళ్లు కలిసి నీళ్ళతో నిండిపోయాయి.

"జానకీ ..."

నా గుండెమీద తల ఆన్చి వస్తున్న దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నం చేసింది.

అంతలో గేటు చప్పుడయింది.

ఇద్దరం ఒకేసారి అటు చూశాం.

నల్లపెంటుమీద తెల్లచొక్కా టక్‌చేసి... కాళ్లకు షూస్ .... భుజానికి వేలాడే బాగ్‌తో ఓ కుర్రాడు మెల్లెక్కి మావైపే వస్తున్నాడు.

జానకి, నేను ఆశ్చర్యంగా చూస్తుండిపోయాం.

''గుడ్ మార్నింగ్ అంకుల్... గుడ్ మార్నింగ్ ఆంటీ..." అన్నాడు దగ్గరగా వచ్చి.

ఆ కుర్రవాడిది దాదాపు మా పెద్దబ్బాయి వయసు.

"నేను ఆంటీ అని ఆ కుర్రాడు తనను తాను పరిచయం చేసుకున్నాడు.

ఆ కుర్రాడు మా జానకి అన్నకొడుకు.

"నువ్వా బాబూ... ఎప్పుడూ చూడలేదు కదా నాయనా అంచుకే గుర్తు పట్టలేదు" అంది జానకి.

''నేను మాత్రం మీ ఫోటో ఎన్నోసార్లు చూశాను. మమ్మీ పుస్తకంలో దాచిపెట్టింది కదా!"

"లోపలికి రావోయ్... మీ అత్తయ్య నిన్ను బయటనే నుంచోబెట్టి మాట్లాడేట్టుంది" అని భుజంమీద చేయివేసి లోనికి తీసుకుపోయాను.

షూ విప్పి జానకి ఇచ్చిన నీళ్ళతో కాళ్ళుకడిగి వచ్చాడు.

"ఒక్కడివే వచ్చావా? అని అడగాను.

''ఆఁ... నాకేం భయంలేదు పెద్దత్తయ్య వాళ్ళింటి కోసారి వచ్చాకదా?"

"మా అడ్రసు ఎలా తెలిసింది?"

"తాతయ్య జేబులో దొరికిందట మా మమ్మీ ఇచ్చింది" అంటూ బాగ్‌లోంచి పాకెట్ తీశాడు.

విష్‌యూహాపీ బర్తుడే ఆంటీ" అంటూ మూతతీసి కలాకంద స్వీటు అందించాడు.

[ ఆంధ్రప్రభ వీక్లి 12-10-1988 ]